క్లుప్తంగా

రెబ్బనపల్లిలో మాక్ పోలింగ్



ఓటు వేసినట్లు చూపుతున్న విద్యార్థులు

దండేపల్లి: మండలంలోని రెబ్బనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు బుధవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నామినేషన్ల దాఖలాలు, ఓటింగ్, ఓట్ల లెక్కింపు వంటి ఎన్నికల ప్రక్రియను విద్యార్థులతో నిర్వహించి, వారికి ఎన్నికలపై పూర్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కత్తెరసాలలో బోనాలు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయానికి బుధవారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో బోనాలు పోసి తీపి పదార్థాలను స్వామి వారికి నైవేద్యంగా పెట్టారు. ఒగ్గు పూజారులు పట్నాలు వేశారు.

ఆర్థిక సాయం



నివాళులర్పిస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఒత్కులపల్లి గ్రామానికి చెందిన కంకణాల దేవేందర్‌రెడ్డి ఎల్ఐసీ ఏజెంటుగా పని చేస్తున్నాడు. ఇటీవల కత్తెరసాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవేందర్‌రెడ్డి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న భారతీయ జీవిత భీమా ఏజెంట్ల సమాఖ్య (లియాఫీ 1964) సంఘం ఆధ్వర్యంలో జీవిత బీమా ఏజెంట్లు రూ.25000 నగదును సేకరించి బుధవారం బాధిత కుటుంబానికి అందజేశారు. అనంతరం దేవేందర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఏజెంట్ల సంఘం అధ్యక్షుడు కె.పూర్ణచందర్, ప్రధాన కార్యదర్శి బండి వాసు, కోశాధికారి చుంచు సాగర్, ఉపాధ్యక్షుడు ముప్పిడి రవీందర్, ఆర్.సత్యనారాయణ రెడ్డి, గుర్రం శ్రీనివాస్, ఈర్ల మల్లిఖార్జున్, ఎం.మదుకర్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

భీమారం: మండలంలోని కాజిపల్లిలో రూ.5లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను బుధవారం జెడ్పీటీసీ తిరుమల ప్రారంభించారు. ఎంపీటీసీ రూప, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్, రవి, బాపు, మాజీ సర్పంచ్ తిరుపతి పాల్గొన్నారు.

లక్సెట్టిపేటలో..

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను అధికారులు, ప్రజాప్రతినిధులు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ మంగ, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పింగిలి రమేష్, పీఆర్ ఏఈ విక్రమ్ రెడ్డి, కార్యదర్శి నరేందర్, గ్రామాధ్యక్షుడు చిన్నయ్య, నాయకులు పాల్గొన్నారు.

డీసీపీని కలిసిన జీఎం మనోహర్



డీసీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న జీఎం

మందమర్రిరూరల్: ఇటీవల మంచిర్యాల డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన డీసీపీ అశోక్‌కుమార్‌ను మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఏ.మనోహర్ బుధవారం మంచిర్యాలలోని డీసీపీ ఆఫీ స్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మందమర్రి ఏరియాలోని సింగరేణి పరిస్థితులను డీసీపీకి వివరించినట్లు జీఎం తెలిపారు.

డీజే నిర్వాహకులకు కౌన్సెలింగ్

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని డీజే నిర్వాహకులకు ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా బుధవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎలాంటి అనుమతులు లేకుండా, ఎలాంటి కార్యక్రమాలకైనా డీజేలను వినియోగించరాదని, శుభకార్యాలకు పది గంటల వరకు డీజేలు, ఇతరులకు ఇబ్బంది కలుగకుండా అనుమతి తీసుకొని వినియోగించుకోవాలని సూచించారు. సూచనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

జనావాసాల్లో డంప్

- ఇళ్ల మధ్యలోనే డంపింగ్ యార్డు ఏర్పాటు
- గుట్టలుగా చెత్త తరలించి.. నిప్పు పెట్టి కాల్చివేత
- పొగ, దుమ్ము, దుర్గంధంతో రోగాల బారిన జనం
- జిల్లా కేంద్రంలోని ఆండాళమ్మ కాలనీవాసులకు తిప్పలు
- ఆందోళనకు దిగినా స్పందించని మున్సిపల్ అధికారులు



ఆండాళమ్మకాలనీ సమీపంలోని డంప్‌యార్డు

డంప్‌యార్డు నుంచి వచ్చే దుర్వాసన, పొగ, దూళి వలన నాకు శ్వాసకోశ సమస్య వచ్చింది. నాలుగు నెలలుగా ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నా. అయినప్పటికీ దగ్గు జ్వరం తగ్గడం లేదు. దీంతో పాఠశాలకు వెళ్లడం మానేశాను. నా చదువు మధ్యలోనే ఆగిపోయేలా ఉంది. అని కాలనీకి చెందిన తోట వైష్ణవి అనే విద్యార్థిని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డంప్‌యార్డులోని చెత్తను కాల్చడం ద్వారా ఉదయం, సాయంత్రం వేళల్లో చెడువాసనతో కూడిన పొగ ఇళ్ల చుట్టూ కమ్ముకుంటుంది. పొగ వలన శ్వాస ఆడక ఉక్కిరిబిక్కిరి అవుతున్నాం. జలుబు, జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాం. శ్వాస సమస్యలు వచ్చినపుడు నెబులైజర్ వాడాలని వైద్యులు సూచనలు చేస్తున్నారు. ఇప్పటికే కాలనీలో 15 కుటుంబాల వారు నెబులైజర్ వాడుతున్నారు. నాకు నెల రోజుల నుంచి చాతి నొప్పి, జ్వరం వస్తుంది. నొప్పి తీవ్రంగా ఉన్నప్పుడు ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకుంటున్నాను. అని కాలనీకి చెందిన గడ్డం సుభద్ర తెలిపారు.

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఆండాళమ్మ కాలనీలో 300కుటుంబాలు నివాసముంటున్నాయి. కాలనీకి సమీపంలోనే మున్సిపాలిటీ అధికారులు డంప్‌యార్డును ఏర్పాటు చేసి పట్టణంలోని తడి,పొడి చెత్తను సేకరించి డంప్‌యార్డులో పడేస్తున్నారు. చెత్త గుట్టలు, గుట్టలుగా చేరిపోతుండడంతో చెత్తకు నిప్పుపెట్టి కాల్చుతున్నారు. చెత్తను కాల్చడం వలన దాని నుంచి వచ్చే పొగ, ధూళి కణాలు ఇళ్లమధ్యన చేరుతున్నాయి. డంప్‌యార్డు ఇళ్ల పక్కనే ఉండడం వలన ఈగలు, దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. రోగాలు వస్తున్నాయి. డంప్‌యార్డును ఇక్కడి నుంచి వేరే చోటికి తరలించాలని కాలనీవాసులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా, కానీ అది కార్యరూపం దాల్చలేదు. గత ఎమ్మెల్యే ఎన్నికలకు ముందు జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ కాలనీని సందర్శించి.. డంప్‌యార్డును రెండు నెలల్లో ఇక్కడి నుంచి వేరే చోటికి తరలిస్తామని చెప్పారు. కానీ ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు వాపోతున్నారు. డంప్‌యార్డును ఇక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేస్తూ కాలనీవాసులు సోమవారం మున్సిపాలిటీ చెత్తబండ్లను డంప్‌యార్డుకు రాకుండా అడ్డుకుని ఆందోళనకు దిగారు. మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

తరలించే ఏర్పాట్లు చేస్తున్నాం

ఆండాళమ్మకాలనీ సమీపంలోని డంప్‌యార్డు వల్ల ప్రజలు ఇబ్బంది పడుతన్న విషయం నా దృష్టికి వచ్చింది. డంప్‌యార్డును అక్కడి నుంచి తరలించాడనికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. వచ్చే నెలలో డంప్‌యార్డును మార్చుతున్నాం. ఇందుకోసం స్థల సేకరణ చేశాం. కాలనీవాసులు ఇబ్బంది పడకుండా, చెత్తను కాల్చకుండా సిబ్బందిని కాపలా పెట్టాం.

- మారుతి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్

రోగాల పాలవుతున్నాం..

డంప్ నుంచి వచ్చే వాసన, పొగ వలన చాలా మంది అనారోగ్యం పాలవుతున్నారు. శ్వాసకోశ వ్యాధులు, జ్వరం, శరీరంపై దద్దుర్లు వస్తున్నాయి. వానాకాలంలో పరిస్థితి చాలా దారుణంగా ఉంటోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

- ఆకుల వెంకటస్వామి, ఆండాళమ్మకాలనీ

డంప్‌యార్డును తరలించాలి

డంప్‌యార్డును వేరే చోటికి తరలించాలని అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చాం. తరలిస్తామని చెప్పి రోజులు గడిచినయ్ తప్పా ప్రయోజనం లేదు. అధికారులు స్పందించి వానాకాలం రాకముందే ఇక్కడి నుంచి డంప్‌యార్డును తరలించాలి.

- గుండ కమలాకర్, స్థానికుడు

కమనీయం.. వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణ మహోత్సవంలో వేదపండితులు

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని శ్రీ విశ్వనాథాలయ ప్రాంగణంలో వేంకటేశ్వరస్వామి అధ్యయన బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేంకటేశ్వర కల్యాణ వేడుకలు బుధవారం రాత్రి కనుల పండవగా జరిగాయి. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. వరంగల్ పెందుర్తికి చెందిన శ్రీనివాస్‌రావు, ఆలయ అర్చకుడు భట్టాచార్యులు పర్యవేక్షణలో వేదమంత్రోచ్ఛరణల మధ్య వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు దంపతులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సురేఖ, ఈవో ముక్తారవి పాల్గొన్నారు.

గోదావరి ఒడ్డున ప్రత్యేక పార్కింగ్

చెన్నూర్: పుణ్య స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా గోదావరినది ఒడ్డున ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని కేటాయిస్తున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు. ఈ నెల 8 శుక్రవారం రోజున మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గోదావరి నది స్నానా లకు వచ్చే భక్తుల కోసం పార్కింగ్ ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. గోదావరి స్నానాలు చేసేందుకు సుమారు 20నుంచి 25వేల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పోలీసులతో పాటు ఎన్ఎస్ఎస్ వలంటరీల సేవలను తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సి పల్ కమిషనర్ గంగాధర్, ఇన్‌చార్జి శాని టరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, కౌన్సిలర్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు రాంలాల్‌గిల్డా పాల్గొన్నారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

పాతమంచిర్యాల: జిల్లాలోని పంచాయతీలలో బకాయి ఉన్న పన్నులను వందశాతం వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావుతో కలిసి బుధవారం ఎంపీడీవోలు, ఎంపీవోలతో పంచాయతీలలో పన్నుల వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పన్నుల వసూలు 70శాతం ఉందని, మార్చి 15లోగా గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న బకాయిలను వసూలు చేసేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. పన్నుల వసూళ్లలో భీమిని, కన్నెపల్లి మండలాలు ముందంజలో ఉన్నాయని, మిగిలిన మండలాలు పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆస్తిపన్ను చెల్లించని వారికి నిబంధనల మేరకు నోటీసులు జారీ చేయాలని, నిర్ణీత గడువులోగా చెల్లించని పక్షంలో ఆస్తులు సీజ్ చేయాలని పంచాయతీ అధికారిని ఆదేశించారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏసీపీ

బెల్లంపల్లిరూరల్: మహా శివరాత్రిని పురస్కరించుకుని జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్ అన్నారు. కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయంలో చేపడుతున్న జాతర పనులను బుధవారం పరిశీలించారు. ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని ఆలయ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఏసీపీ కుటుంబ సమేతంగా ఆలయంలో రుద్రాభిషేకం, బిల్వార్చనతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలుద్దీన్, తాళ్లగురిజాల ఎస్సై నరేష్, ఆలయ కమిటీ సభ్యులు సంతోష్, గోపి, సిబ్బంది భాను తదితరులున్నారు.

సీపీఎం పాదయాత్ర విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు

చెన్నూర్‌రూరల్: సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 12న చేపట్టే పాదయాత్రను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బోడెంకి చందు అన్నారు. మండలంలోని బావురావుపేట గ్రామ సమీపంలో బుధవారం సీపీఎం పార్టీ జనరల్‌బాడి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చందు మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రజలు తాగు నీటి సమస్యతో చాలా బాధపడుతున్నారన్నారు. తాగునీరు, జోడువాగులు వద్ద పెద్ద వంతెన, రోడ్డు సరిగ్గా లేకపోవడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అయినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తక్షణమే జోడువాగులు వద్ద వంతెన, రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ జోడువాగులు వద్ద నుంచి భీమారం వరకు సీపీఎం బృందం పాదయాత్ర చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ పాదయాత్రకు ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు రవి, ఉమారాణి, నాగజ్యోతి, సమ్మక్క, సరిత, యామిని, బూదక్క, చంద్రన్న, నగేష్, రాజేశ్వరి, లక్ష్మి, జమున, రాములు, తదితరులు పాల్గొన్నారు.

'రైతునేస్తం' వీడియో కాన్ఫరెన్స్



భీమిని: వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

భీమిని/చెన్నూర్‌రూరల్/లక్సెట్టిపేట: చెన్నూర్ మండలంలోని కిష్టంపేట రైతు వేదికలో, లక్సెట్టిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులోని రైతు వేదికలో, భీమిని మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో రైతులకు నూతన సాంకేతికతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లక్సెట్టిపేటలో జిల్లా వ్యవసాయాధికారి కల్పన, ఎంపీపీ అన్నం మంగ, జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య, మండల వ్యవసాయాధికారి చెల్లా ప్రభాకర్ రెడ్డి, చెన్నూర్‌లో ఏడీఏ రాజేశం, నోడల్ అధికారి వెంకటరమణ, చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్, ఏవోలు మార్క్‌గ్లాడ్‌స్టన్, మహేందర్, తహసీల్దార్ మల్లిఖార్జున్, సెరీకల్చర్ అధికారి యోనస్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, ఏఈవో సాయికృష్ణ, భీమినిలో డీవోఏ ఇంతియాజ్ అహ్మద్, నోడల్ అధికారి దత్తారావు, మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్, తహసీల్దార్ విక్రమ్ దాస్, జెడ్పీటీసీ పోతురాజుల గంగక్క, ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరీ, రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జిల్లాకు లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలి

పాతమంచిర్యాల: జిల్లాకు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏవో రాజేశ్వర్‌కు వినతిపత్రం ఇచ్చారు. జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ నాటి స్వాతంత్ర్య పోరాటం నుంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం వరకు అనేక పోరాటాలు చేసి జైలు జీవితం గడిపారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు గజెల్లి వెంకటయ్య, రాష్ట్ర కార్యదర్శి బోరే యాదగిరి, పట్టణ అధ్యక్షుడు మహేష్, నాయకులు కిరణ్, గగ్గూరి రాజన్న, అంకం సతీష్, గుమ్ముల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సీఐ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ కుమారస్వామి

భీమిని: కన్నెపల్లి మండలంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ఉన్న మెట్‌పల్లి, నాయకునిపేట గ్రామ పంచాయతీలలోని పోలింగ్ కేంద్రాలను బుధవారం తాండూర్ సీఐ కుమారస్వామి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వివరాలను బూత్ లెవల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అంతకుముందు మండల కేంద్రంలోని కన్నెపల్లి పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష

భీమారం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీవో, ఏపీవో, పంచాయతీ కార్యదర్శులు, టీఏ, ఎఫ్ఏలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాధా రాథోడ్ మాట్లాడారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని, సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఉపాధిహామీ సిబ్బంది క్షేత్రస్థాయిలో పని ప్రదేశానికి వెళ్లి, ఉదయమే పనులకు హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యదర్శులు పారిశుద్ధ్య నిర్వహణ, హరితహారంలో భాగంగా నర్సరీలలో మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు.

ఓటు వజ్రాయుధం



మాట్లాడుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్

పాతమంచిర్యాల: మెరుగైన సమాజం, ప్రజాస్వామ్య స్థాపనలో ఓటు వజ్రాయుధమని స్వీప్ నోడల్ అధికారి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం అంతర్జాతీయ సెక్స్ వర్కర్ల హక్కుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలలో అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్ (స్వీప్)బలమైన ప్రజాస్వామ్యానికి నాంది అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు పలు పాటలతో విద్యార్థులకు ఓటు ఆవశ్యకతపై వివరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, జిల్లా వయోజన విద్యా అధికిరి పురుషోత్తం నాయక్, పీడీ సిద్ధయ్య, స్నేహ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శ్రీనివాస్, జిల్లాల మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, స్వీప్ సమన్వయ కర్తలు రాంచందర్, కుమార్ పాల్గొన్నారు.

పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం

నస్పూర్: ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు సహకారంతో పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు తెలిపారు. పట్టణ పరిధిలోని 20వ వార్డు సీతారాంపల్లిలో బుధవారం ఆయన రూ.5లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో డ్రెయినేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ సుబ్బారెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, జిల్లా యూత్ అధ్యక్షుడు తాళ్ల సంపత్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ దర్ని మధూకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



కాసిపేట: వేడుకల్లో పాల్గొన్న మహిళలు



బెల్లంపల్లి: మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శ్వేత

బెల్లంపల్లి: ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం బెల్లంపల్లి సీఎస్ఐ ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో ఉమాదేవి, అంగన్‌వాడీ సూపర్ వైజర్ ఎల్.జ్యోతి, మున్సిపల్ కౌన్సెలర్లు పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ రొడ్డ లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక పాల్గొని మాట్లాడారు. మహిళలను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

శ్రీరాంపూర్: ఈ నెల 8న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని సింగరేణి యాజమాన్యం మహిళలకు క్రీడా పోటీలను నిర్వహించింది. ఇందులో భాగంగా బుధవారం జీఎం కార్యాలయంలోని ఉద్యోగినులకు క్రీడా పోటీలు నిర్వహించారు. సమీప సెంట్రల్ నర్సరీలో నిర్వహించిన పోటీలను డీజీఎం పర్సనల్ అరవిందరావు ప్రారంభించారు.

మహిళల అభివృద్ధే లక్ష్యం

మంచిర్యాలక్రైం: మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఢిల్లీ నుంచి దేశ వ్యాప్తంగా 'నారి శక్తి వందన్' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా మహిళలు వీక్షించేందుకు స్థానిక హమాలివాడలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీష్ జైన్ ఆధ్వర్యంలో ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. మోదీ ప్రసంగాన్ని వినేందుకు అధిక సంఖ్యలో మహిళలు హాజరయ్యారు.

సూపర్‌బజార్‌లో 'నారీ శక్తి వందన్'

రామకృష్ణాపూర్: పట్టణంలోని సూపర్‌బజార్ సెంటర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం 'నారీ శక్తి వందన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లైవ్ ప్రసంగాన్ని ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రదర్శించారు. కేంద్ర ప్రభుత్వం మహిళలకు కోసం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను మోదీ వివరించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోషం, అశోక్, డీవీ దీక్షితులు, రమేష్, రాజేందర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో 6వ తరగతి సీట్లతో పాటు 7, 8, 9, 10తరగతుల్లో మిగులు సీట్లకు ఈ నెల 11వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య తెలిపారు. దరఖాస్తులకు గడువు ముగిసినప్పటికీ మోడల్‌స్కూల్‌లో ప్రవేశాలకు ప్రభుత్వం గడువు పెంచిందని కాసిపేట, బెల్లంపల్లి మండలాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. బాలికలకు హాస్టల్‌వసతి ఉందని నాణ్యమైన ప్రభుత్వ విద్యను సద్విని యోగం చేసుకోవాలని కోరారు.

పాతమంచిర్యాల: 2024-25విద్యా సంవత్సరానికి ఉన్నత చదువుల కోసం అంబేద్కర్ విద్యానిధి పథకం కోసం జిల్లాలోని ఎస్సీ కులాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

సూపరింటెండెంట్‌కు కన్నీటి వీడ్కోలు

నెన్నెల: మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ రాధాకిషన్‌కు బుధవారం మంచిర్యాల గద్దెరాగడిలో అంత్యక్రియలు నిర్వహించారు. గుండెపోటుతో మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లో ఆయన మృతి చెందిన విషయం తెలిసిందే. అదనపు కలెక్టర్ రాహుల్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు రాధాకిషన్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సానుభూతి వ్యక్తం చేశారు. నెన్నెల ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శులు పద్మనాభం, సతీష్, సంతాపం ప్రకటించారు. సహచర అధికారులు, ఉద్యోగులు, బంధువుల అంతిమ యాత్రలో పాల్గొని తుది వీడ్కోలు పలికారు.

భూ సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్

దండేపల్లి: గతంలో ధరణిలో దరఖాస్తులు చేసుకున్న వారంతా మళ్లీ తహసీల్దార్ కార్యాలయానికి తరలి వస్తున్నారు. పెండింగ్ దరఖాస్తులను మళ్లీ అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. ఇకనైనా తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశపడుతున్నారు. దండేపల్లి మండలంలో ఇప్పటి వరకు 840ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో ఎక్కువగా మ్యుటేషన్లు ఉండగా, వీటితో పాటు నాలా కన్వర్షన్, జీఎల్ఎంకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయి.

'గృహజ్యోతి'కి దరఖాస్తు చేసుకోవచ్చు

జన్నారం: గృహజ్యోతి పథకం కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు ఇవ్వనివారు, జీరో బిల్లు రాని వారు నేరుగా ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి దరఖాస్తులు ఇవ్వవచ్చని ఎంపీడీవో శశికళ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ప్రజల నుంచి దరఖాస్తులను తీసుకున్నారు.

సరుకులు అందజేత

రామకృష్ణాపూర్: మున్సిపాలిటీలోని శేషపల్లికి చెందిన కుర్మకుమార్ ఇటీవల మృతిచెందగా అతడి కుటుంబానికి మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎర్రం విద్యాసాగర్‌రెడ్డి బుధవారం విశాఖ చారిటబుల్ ట్రస్ట్ తరుపున 50కేజీల బియ్యం, రూ.5000విలువ చేసే నిత్యావసర సరుకులను అందించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల: 9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899